క్లుప్తంగా

సమాజంలో ఉన్నతంగా ఉండాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు సమాజంలో వారు ఎంచుకున్న రంగాల్లో నిష్ణాతులుగా రాణించాలని ఎస్‌బీఐటీ, ఆర్జేసీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ అన్నారు. మంగళవారం నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల అకాడమిక్ అవార్డు కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. 70 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత పాఠశాల యాజమాన్యానికి దగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆరోగ్యమేరీ, లాజర్ ఫాదర్, సుపీరియర్ విజయ మేరీ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం పాఠశాల విద్యార్థినులు ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొని గెలుపొందారని పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు సీహెచ్.చైత్ర, ఎం.కిరణ్మయిలు మెదక్ జిల్లా గజ్వేల్‌లో జరిగిన ఈ పోటీల్లో పాల్గొని విన్నర్‌గా నిలవగా అందులో చైత్ర బెస్ట్ అవార్డును దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా, మంగళవారం హెచ్‌ఎంతో పాటు పీఈటీ నాగేశ్వరరావు, ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి ఆదర్శ్‌కుమార్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

నేలకొండపల్లి: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పెంచాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. నేడు నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం చేపట్టి మండల కేంద్రంలో ముట్టడికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు ప్రమాద బీమా పెంచాలని, 60 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, బాబు, వెంకయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

బుక్ రీడర్స్ క్లబ్‌తో జ్ఞాన సముపార్జన

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు బుక్ రీడర్స్ క్లబ్ చేయూతగా నిలుస్తోందని సుడా చైర్మన్ బచ్చు విజయ్ అన్నారు. నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో బుక్ రీడర్స్ క్లబ్‌ను మంగళవారం ఆయన సందర్శించాక ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ తరం విద్యార్థులు జ్ఞానమే ఆస్తిపాస్తులుగా భావించాలని సూచించారు. బుక్ రీడర్స్ క్లబ్ కన్వీనర్, కేయూ ఈసీ సభ్యుడు డాక్టర్ సీతారాంతో పాటు అధ్యాపకులు డాక్టర్ జె.రమేష్, డాక్టర్ బీ.వీ.రెడ్డి, డాక్టర్ కేఎస్ఎస్.రత్నప్రసాద్, డాక్టర్ రమా సత్యవతి పాల్గొన్నారు.

11న మెగా లోక్ అదాలత్

కూసుమంచి: కూసుమంచి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల రాజీ కోసం ఫిబ్రవరి 11వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యాన నిర్వహించే ఈ కార్యక్రమంలో యాక్సిడెంట్, ఘర్షణ, చీటింగ్, వివాహ సమస్యలు తదితర కేసులు పరిష్కరించబడతాయని, రాజీపడి కేసులు కొట్టేయదల్చుకొనే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8008586464, 9949993137ను సంప్రదించాలని కోరారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మమత ఆస్పత్రి రోడ్‌లోని శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థిని జె.సాయ సుప్రజీత్, డి.యశ్వంత్‌రెడ్డిలు కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. కుమిటే పోటీల్లో విద్యార్థులు బంగారు పతకం, అమూల్యా కుమిటే పోటీల్లో కాంస్య పతకం, ఏ.సంజిత్‌కుమార్, యశ్వత్‌కుమార్ కటా విభాగంలో బంగారు పతకాన్ని సాధించారన్నారు. మంగళవారం పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు నాగ ప్రవీణ, శర్మ, శిక్షకుడు షేక్.ఆరీఫ్ తదితరులు అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో యాచకుడు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో కొన్నాళ్లుగా ఉంటున్న యాచకుడు(45) ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు జీఆర్పీ ఎస్సై ఎస్సై భాస్కర్‌రావు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, తన సిబ్బందితో కలిసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.



నేలకొండపల్లి: సింగారెడ్డిపాలెం పాఠశాలలో నిర్మించిన వాటర్ ట్యాంక్



రఘునాథపాలెం: ముస్తాబైన వేపకుంట్ల పాఠశాల



రఘునాథపాలెం: వేపకుంట్ల పాఠశాలలో టాయిలెట్లు

బాగు'బడి'..!

ప్రభుత్వ పాఠశాలలకు కొత్త కళ..

- కార్పొరేట్ స్థాయిలో సర్కార్ బడులు
- ఒక్కో మండలానికి ఒక్కో పాఠశాల చొప్పున పనులు పూర్తి
- నేడు ప్రారంభంకానున్న పలు పాఠశాలలు



నేలకొండపల్లి: ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సింగారెడ్డిపాలెం పాఠశాల

తెలంగాణ ప్రభుత్వం మన ఊరు...మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో ఒకప్పుడు పెచ్చులు ఊడిన తరగతి గదులు, పాకుడు పట్టిన గోడలు, వచ్చిరాని నీటి నల్లాలు, మిరుకుమిరుకుమనే విద్యుత్ లైట్లతో ఉన్న ప్రభుత్వ బడులను బాగు చేసుకోనే అవకాశం వచ్చింది. తరగతి గదిని చూస్తేనే విద్యార్థులకు బడికి పోవాలనే ఆశ కలిగించే విధంగా బడులను తీర్చిదిద్దారు. మండలంలో ఎంపికైన పాఠశాలలను నేడు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేశారు.

నేలకొండపల్లి/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం కింద కొంగొత్త అందాలతో తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలను నేడు విద్యాశాఖాధికారులు ప్రారంభించేందుకు ముస్తాబు చేశారు. మండలంలో ఎంపికైన మొత్తం పాఠశాలల్లో కనీసం ఒక్కో మండలానికి ఒక్కో పాఠశాల చొప్పున పనులు పూర్తయ్యాయి. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా సకల సౌకర్యాలు కల్పించగా.. ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఆరు రకాల చిత్రాలను తీయించాలని అధికారులు సూచించటంతో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు చిత్రాల తీయించి జిల్లా విద్యాశాఖాధికారులకు పంపించారు.

కార్పొరేట్‌కు దీటుగా..

ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు సమకూరుతున్నాయి. పాఠశాలల్లో ప్రశాంతమైన వాతావరణం కల్గించేలా వివిధ రకాల రంగులతో కూడిన బొమ్మలు, తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, అదనపు గదుల నిర్మాణం, ప్రహరీ, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట షెడ్లు, నీటి వసతి, గ్రీన్ చాక్ బోర్డు, గోడలకు పెయింటింగ్స్ వంటి పనులు చేపట్టారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డైనింగ్ హాల్, డిజిటల్ తరగతులు ప్రాధాన్యం బట్టి చేపట్టారు.

నేలకొండపల్లి మండలంలో..

నేలకొండపల్లి మండలంలో మొత్తం 22 పాఠశాలలు ఎంపిక కాగా వీటిలో మూడు మోడల్ స్కూళ్లలో(బైరవునిపల్లి, సింగారెడ్డిపాలెం, బాలికల పాఠశాల నేలకొండపల్లి స్కూల్) సింగారెడ్డిపాలెం పాఠశాలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. అంతేకాక కూసుమంచి మండలంలో ఎంపికైన 23 పాఠశాలలో జక్కేపల్లి పాఠశాల మాత్రమే ప్రారంభానికి నోచుకుంది. కాగా, తిరుమలాయపాలెం మండలంలో ఎంపికైన 25 పాఠశాలల్లోనూ పనులు పూర్తి కాకపోవటంతో ఓ ఒక్క పాఠశాల ప్రారంభానికి నోచుకోలేదు.

రఘునాథపాలెం మండలంలో..

రఘునాథపాలెం మండలంలోని మొత్తం 21 పాఠశాలలు ఎంపిక కాగా అందులో ఎనిమిది పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. వీటిలో గణేశ్వరం, వేపకుంట్ల ప్రాథమిక పాఠశాలలు మాత్రమే ప్రారంభానికి సిద్ధం చేశారు. వేపకుంట్ల పాఠశాలలో రూ.8.76 లక్షల నిధులు కేటాయించి టాయిలెట్స్‌కు టైల్స్, ప్రతీ తరగతి గదిలో 4 ఫ్యాన్లు, 4 ట్యూబ్ లైట్లు, విద్యార్థులు కూర్చోవడానికి 38 బెంచీలు, గ్రీన్ చార్ట్ బోర్డులను అమర్చి బడి అంటే ఇలా ఉండాలనే విధంగా తయారు చేశారు.



రఘునాథపాలెం: కొత్త బెంచీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వేపకుంట్ల సర్పంచ్ ధారా శ్యాం

కార్పొరేట్‌కు దీటుగా..



పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు కల్పించటం తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ పథకం ఓ వరం లాంటిది.

– భూక్యా సుధాకర్, సర్పంచ్, మంగాపురంతండా

చర్యలు తీసుకున్నాం..



నేలకొండపల్లి మండలంలోని ఎంపికైన అన్ని పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. సింగారెడ్డిపాలెం పాఠశాల నూరు శాతం పనులు పూర్తి చేసి ఆదర్శంగా నిలుస్తోంది.

– బి.రాములు, ఎంఈఓ, నేలకొండపల్లి

అన్ని సౌకర్యాలు సమకూర్చారు..



వేపకుంట్ల పాఠశాలలో అన్ని రకాల పనులు పూర్తయ్యాయి. విద్యార్థులను ఆకర్షించేలా తరగతి గదులు, బొమ్మలు, టాయిలెట్స్, తాగు నీటి వసతి కల్పించారు. కార్పొరేట్ స్థాయిలో బెంచీలు వచ్చాయి.

– ఎస్‌కె.సర్వార్‌మియా, పాఠశాల హెచ్‌ఎం

ప్రభుత్వ సూచనల మేరకే..



పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమేకాకుండా అదే స్థాయిలో అన్ని సౌకర్యాలను కల్పించడం గొప్ప విషయం. ప్రభుత్వం సూచనల మేరకు మౌలిక సదుపాయాల కల్పించి అభివృద్ధి చేశాం.

– బి.నవీన్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్

'చావో.. దారో' తేల్చుకుంటాం!

నేలకొండలపల్లి: గిరిజనుల భూములు సాగు చేసుకోకుండా కబ్జా చేసిన దారిని సాధించేందుకు చావో దారో తెల్చుకుంటామని దారి సాధన సమితి గిరిజన సంఘం ప్రతినిధులు భూక్యా రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని తిరుమలాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని తిరుమలాపురం గ్రామంలో భూములు సాగు చేసుకోకుండా కబ్జాకు గురైన దారికి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. 50 ఎకరాలు గిరిజనులు రెండేళ్ల నుంచి సాగు చేయకుండా ఉన్నారని, కలెక్టర్ ఆదేశాలను అధికారులు కూడా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ నెల 9న నేలకొండపల్లి మండలాన్ని దిగ్బంధం చేయనున్నట్లు తెలిపారు. నక్షలో ఉన్న 33 అడుగుల రహదారిని మాకు అప్పగించాలని, గ్రామ కంఠం 4 ఎకరాలు, ఆంజనేయస్వామి దేవాలయం భూమి 20 కుంటలను గ్రామానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. తాము చేసే న్యాయమైన పోరాటానికి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సహకరించాలని కోరారు.

నిందితులను శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బహుజన న్యాయవాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు కోరారు. దీనిపై మంగళవారం సీపీని కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, కో కన్వీనర్ వెంకటరమణ, భద్రూనాయక్, సంజీవరావు, ఎస్‌కె.నజీమా, లిక్కి కృష్ణారావు, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకునూరి మురళి అరెస్ట్ అప్రజాస్వామికం..

ప్రభుత్వం పేదలకోసం కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు గత ఐదేళ్లుగా లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించినందుకు సోషల్ డెమోక్రటిక్ ఫోరం కో కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి అరెస్ట్ అప్రజాస్వామికమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు తెలిపారు. మంగళవారం సంఘ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులు వీరభద్రం, వెంకటరమణ, భద్రూనాయక్, నజీమా, రెహమాన్, సంజీవరావు, వెంకటేశ్వరావు, నరసింహారావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకోవాలి

విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ చార్జీల భారం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం పలు మండలాల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాలు చేపట్టారు. అనంతరం విద్యుత్ ఏఈలకు వినతిపత్రాలు సమర్పించారు. విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ రంగానికి నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి(కారేపల్లి): కొత్తలింగాల విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు



తిరుమలాయపాలెం: తిప్పారెడ్డిగూడెంలో వినతి పత్రం ఇస్తున్న ప్రజాపంథా నాయకులు



ఖమ్మంరూరల్: ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

చర్యలు తీసుకోండి

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ విద్యలో జరుగుతున్న పరిణామాల్లో తప్పులు చేసిన వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్య జేఏసీ నాయకులు కేఎస్ రామారావు, శ్రీనివాసరావు తదితరులు ఒక ప్రకటనలో కోరారు. నిరాధారమైన ఆరోపణలు చేసే వారి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి వెలుగులోకి తెచ్చిన పలు విషయాలను పరిగణలోకి తీసుకొని ఆయనపైన, సంఘం బాధ్యులపైనే బోర్డు సెక్రటరీ నవీన్‌మిట్టల్ చేసిన ఆరోపణలను భేషరతుగా ఉపసంహరించుకోవాలని, పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తమ్మిన్ని నాగేశ్వరరావు పార్టీ పదవితో పాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే, పలువురు పార్టీని వీడనుండగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెంట నడవాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి(కారేపల్లి): రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ కామేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామేపల్లి మండలంలో ఇప్పటి వరకు రూ.13.99 కోట్లు విలువైన 924 చెక్కులను పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, ఎంపీపీ బాణోతు సునీత, ఎంపీడీఓ పీవీఎన్ఎన్ గుప్తా, రైతుబంధు కన్వీనర్ అంతోటి అచ్చయ్య, ఏఓ తారాదేవి, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావు, ఆర్ఐ అంతోటి మానిక, ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా గోడౌన్ల పరిశీలన



గోడౌన్‌లో యూరియాను పరిశీలిస్తున్న చైర్మన్లు

నేలకొండపల్లి: సొసైటీలకు సరఫరా చేసే యూరియాలో గడ్డలు లేకుండా నాణ్యమైన యూరియా సరఫరా చేయాలని డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు మార్క్‌ఫెడ్ అధికారులను కోరారు. మండలంలోని సొసైటీ చైర్మన్లతో కలిసి బుధవారం మార్కెటింగ్ డీఎం సునీతను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా వలన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పాత స్టాక్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియాను పెంచాలని కోరారు. సొసైటీ చైర్మన్లు పగిడిపత్తి శ్రీనివాస్, అనంతు కాశయ్య, తన్నీరు సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి తుమ్మల పర్యటన



నివాళులర్పిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి/కూసుమంచి/తిరుమలాయపాలెం: ఖమ్మంతో పాటు పాలేరు నియోజకవర్గంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పర్యటించారు. ఖమ్మంలో ఇటీవల మృతి చెందిన శీలం లక్ష్మి కుమారుడు డాక్టర్ శీలం పాపారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, నేలకొండపల్లి మండలం బోదులబండలో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇంకా కూసుమంచి మండలంలోని గట్టుసింగారం బీఆర్ఎస్ అధ్యక్షుడు నెల్లూరి వీరభద్రం తల్లి సీతారావమ్మ మృతి చెందగా ఆమె కుటుంబీకులను కూడా తుమ్మల పరామర్శించారు. అలాగే, తిరుమలాయపాలెం, రఘునాథపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఓర వెంకటేశ్వర్లును కూడా నాగేశ్వరరావు పరామర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బండి జగదీష్, జంగం భాస్కర్, గుత్తా వెంకటేశ్వరరావు, అర్వపల్లి విద్యాసాగర్, పత్తి శ్రీనివాస్, పోలూరి రమేష్, తేజావత్ ఎల్లయ్యనాయక్, రడం సురేష్, రామారావు, శాఖమూరి రమేష్, జూకూరి గోపాలరావు, వెన్నపూసల సీతారాములు, కడియాల శ్రీనివాసరావు, కొమ్మూరి నరేష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, కడియాల నరేష్, వెల్లంపల్లి లక్ష్మీకాంతమ్మ, మాదాసు ఉపేందర్, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, సేట్రాం నాయక్, లోడిగ వెంకన్న, బండి జగదీష్, బానోతు బాలునాయక్, చీమ లక్ష్మయ్య పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం

ఖమ్మం మామిళ్లగూడెం: బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై బీఆర్ఎస్ నాయకుడు గువ్వల బాలరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు గర్హనీయమని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బుర్ర ఉపేందర్‌సాహూ అన్నారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని మాట్లాడడం అంటే దొంగే దొంగ అన్న చందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరావు, మిరియాల నాగరాజు, బి.ఉపేందర్, మట్టి నాగేశ్వరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఘన సన్మానం



గీతాంజలిని సన్మానిస్తున్న దృశ్యం

కామేపల్లి(కారేపల్లి): నేషనల్ రాక్ లైన్స్‌లో బంగారు పతకం సాధించిన మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన విద్యార్థిని గీతాంజలిని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన సభావత్ చిన్న, శారదల కుమార్తె గీతాంజలి మామకన్ను గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కాగా, గీతాంజలి ఇటీవల డార్జిన్‌లో జరిగిన నేషనల్ రాక్ లైన్స్‌లో బంగారు పతకం సాధించిన సంగతి పాఠకులకు విదితమే. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రేడబోతు గోపిరెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, సర్పంచ్ విజయమోహన్, దేవేండ్ల రామకృష్ణ, మాలోతు బాషింగ్, దొడ్డ వేణు, సురేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక



ఖమ్మంమయూరిసెంటర్: పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న కృష్ణమోహన్

ఖమ్మంమయూరిసెంటర్/ తిరుమలాయపాలెం: వివిధ పార్టీలకు చెందిన పలువురు మంగళవారం వైఎస్సార్ టీపీలో చేరారు. ఖమ్మం నగరంలోని 32, 34 డివిజన్లలోని ఖానాపురం, ప్రశాంతినగర్‌కు చెందిన పలువురు మంగళవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. వీరికి వైఎస్సార్‌టీపీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జి తుంపాల కృష్ణమోహన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో పలు కుటుంబాలు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల పీఏ నంద్యాల రవీందర్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కాగా, మండలంలోని గోపాయిగూడెం, బచ్చోడుతండా గ్రామాలలో ఇటీవల మృతిచెందిన ఇమాంబి ధారావత్ రవి కుటుంబాలను నంద్యాల రవీందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు తుమ్మా అప్పిరెడ్డి, బూత్ కన్వీనర్ మర్రి శ్రీనివాస్, యువజన విభాగం మండల అధ్యక్షులు దూదిమెట్ల వెంకట్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వాలూరి సత్యనారాయణ, అన్నబత్తుల కృష్ణ, నాయకులు లక్ష్మయ్య, ఉపేందర్, సొంటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రావుల గంగరాజు, యూత్ ఉపాధ్యక్షుడు రేగళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.